క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్రస్థాయిలో జరగనున్న అథ్లెటిక్ పోటీలకు ఎంపిక కావడంతో శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అథ్లెటిక్ కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన 7వ తరగతికి చెందిన విద్యార్థినులు సి.మీనాక్షి, జి.మీనాక్షి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేశారు. విద్యతో పాటు ఆటపాటలో రాణించాలని పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాజవర్ధన్‌చారి, సీనియర్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



పాన్‌గల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా విధుల్లో చేరిన ఎస్‌ఐ కళ్యాణ్‌రావును శుక్రవారం కేతేపల్లి, అన్నారం కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో తమ వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, కురువ సంఘం నాయకులు బాలు, కొల్లాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వహీద్, జిల్లా సేవాదళ్ జనరల్ సెక్రెటరీ రమేష్, సురేందర్, భీరయ్య, శంకర్, సురేష్, పర్వతాలు, భాను తదితరులు పాల్గొన్నారు.

అధికారికి..



కొత్తకోట రూరల్: ఎంపీపీ గుంత మౌనిక పదవీ కాలం ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం కొత్తకోట మండల ప్రత్యేక అధికారిగా రామమహేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రామమహేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అధికారికి మాజీ ఎంపీపీ గుంత మౌనికతో పాటు ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది పూలబొకే ఇచ్చి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తాత్కాలిక తహసీల్దార్‌గా తిలక్‌కుమార్‌రెడ్డి



గోపాల్‌పేట: మండల తాత్కాలిక తహసీల్దార్‌గా శుక్రవారం తిలక్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మదనాపురం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఆయనకు గోపాల్‌పేట తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన శ్రీనివాసులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన విషయం తెలిసిందే.

కొనసాగుతున్న ధరణి దరఖాస్తుల పరిశీలన

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆరో రోజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలించినట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలో మొత్తం 226 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 57 దరఖాస్తుల సమస్యలను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, తమ పరిధిలో లేని వాటిని జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ఖిల్లాఘనపురం: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు, త్యాగశీలి శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, జిల్లా పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్ విక్రం, మండల యువ మోర్చా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు శివ, రాజు, అంజి, నరేందర్ పాల్గొన్నారు.



కొత్తకోటలో..



రామన్‌పాడులో..

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సాక్షి, నెట్‌వర్క్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకొని రోగాలను తరిమేయాలని మున్సిపల్ ప్రత్యేక అధికారులు స్వర్ణసింగ్, మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప అన్నారు. ఫ్రైడే డ్రై డే లో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ హౌజులు, కొబ్బరి బోండాలు, పాత టైర్లల్లో నిలిచిన నీటిని పారబోసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా ఇంటిలో రెండు మూడు రోజులకోసారి నీటి చల్లి కొత్త నీటిని పట్టుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు నాగరాజు, ఎస్‌ఎన్ సూర్యకుమార్, నురుల్‌నదీం, చైర్‌పర్సన్లు గాయత్రి, సుకేషిని, మంగమ్మ, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమీషనర్ నాగరాజు అన్నారు. కౌన్సిలర్లు గద్దమీది యాదమ్మ, పెండెం నాగన్నయాదవ్, పద్మమ్మ, ఖాజా, మున్సిపల్ మేనేజర్ రవీందర్, ఆర్‌ఐ కృష్ణయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, సుమిత్ర, శ్రీలక్ష్మి, ప్రమీలమ్మ, రామచంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజు



వనపర్తిలో..



వీపనగండ్లలో..



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో..

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

పెబ్బేరు రూరల్: వనపర్తి సమీపంలోని తిరుమలయ్య గుట్ట వద్ద 58 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు 5 గుంటల స్థలాన్ని కేటాయించి, అక్కడ పర్యాటక కేంద్రంగా మార్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం వనపర్తి మండలంలోని పెద్దగూడెం శివారులోని తిరుమల్లయ్య గుట్ట సన్నిధిలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము కుటుంబసమేతంగా అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి సారించి తిరుమలయ్య గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలయ్య గుట్ట వద్ద సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో అంజన్న పల్లకీ సేవ

వనపర్తి టౌన్: చింతల హనుమాన్ ఆలయంలో అమావాస్య సందర్భంగా శుక్రవారం స్వామిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయంలో ఆకు పూజ, అర్చన చేశారు. ఆంజనేయ మాలాధారణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి వాయిద్యాలు, మేళతాళాల నడుమ భజన కీర్తనలు చేస్తూ పంచామృతాలతో అభిషేకించారు. అభిషేకం అనంతరం ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి వాయిద్యాలతో ఆలయం చుట్టూ పల్లకీ సేవా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్నదానం చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద గురువారం అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామివారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెండింగ్ కూలి చెల్లించాలి

పాన్‌గల్: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ కూలి వెంటనే చెల్లించాలని దళిత సంఘం మండల నాయకులు ఆదిస్వామి, గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పనులు చేసిన కూలీలకు సంబంధించి ఆరు వారాల కూలి పెండింగ్‌లో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలి డబ్బులు వారం, వారం మంజూరు కాకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పాటు ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఏడాది పొడువున పనులు కల్పించాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

గోపాల్‌పేట: వసతి గృహాల్లో ఎక్కువ మొత్తంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులే ఉంటారని, వారికి ప్రభుత్వ పరంగా అందే అన్ని సౌకర్యాలు నాణ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. శుక్రవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం మెనూ తప్పనిసరిగా పాటించాలని ప్రిన్సిపల్ ఆరోగ్యం కోరారు. ఆహార నాణ్యత, తాగునీరు మొదలైన సౌకర్యాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, కార్యదర్శి వెంకటయ్య, మండల నాయకులు లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

వనపర్తిటౌన్: ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు జరిగే జాతీయ సౌత్‌జోన్ హాకీ జూనియర్ నేషనల్ టోర్నమెంట్‌కు తెలంగాణ జట్టు నుంచి వనపర్తి క్రీడాకారులు ఎంపికయ్యారు. జూన్ 30న హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేసినట్లు హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి బోలమోని కుమార్ శుక్రవారం తెలిపారు. బాలుర విభాగంలో భాస్కర్, హన్మంతు, రాంలాల్, దివాకర్.. బాలికల విభాగంలో మమత, అనిత, పావని, మంజుశ్రీ ఎంపికైన నట్లు వివరించారు. హాకీలో జిల్లాకు మంచి పేరుందని.. తెలంగాణ జట్టుకు తీసుకొచ్చేలా ప్రతిభ కనబర్చాలని కోరారు. క్రీడాకారులను మహబూబ్‌నగర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పి.మన్యం, గద్వాల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఆనంద్, జిల్లా ట్రెజరర్ నిరంజన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, కోచ్ జావిద్ క్రీడాకారులను అభినందించి పలు సూచనలు చేశారు.



క్రీడాకారులతో హాకీ అసోసియేషన్ ప్రతినిధులు

కూలి పెంచాలి

పెబ్బేరు రూరల్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జీఓ నంబర్ 48 సవరణ చేయకుండా, నిత్యవసర ధరలను పెరగడంతో కూలీలకు భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో అజయ్, దేవన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

అమరచింత: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ భవనం ముట్టడి నేపథ్యంలో మండలంలోని విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాల నాయకులను శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ముందస్తు అరెస్టులు చేశామన్నారు.

చెట్లతోనే మనుగడ

ఆత్మకూర్: వృక్షాలతోనే జీవ మనుగడ సాధ్యమవుతుందని, పర్యావరనం పరిరక్షణ సాధ్యమని వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పీజేపీ పార్కులో మొక్కలను నాటారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నయ్య, మహేశ్వరి, అశ్విన్‌కుమార్, పోషన్న, యాదమ్మ, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, తబసుం, పురపాలిక సిబ్బంది ఉన్నారు.



మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

గ్రూపులొద్దు.. హుందాగా రాజకీయాలు చేద్దాం

వనపర్తి టౌన్: డీసీసీ అధ్యక్షుడితో సహా నాయకులు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా హుందాగా రాజకీయాలను చేస్తూ ఐక్యతతో ముందుకెళ్దామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ పిలుపునిచ్చారు. మనలో మనమే గ్రూపులు సృష్టించుకుంటే కార్యకర్తలు, నాయకులు ఆందోళనకు గురయ్యే అవకాశం ఉందని, ఒకే పార్టీలోని నాయకులపైనే మాట్లాడే పరిస్థితులు తలెత్తడం బాధాకరమన్నారు. మూడు రోజుల క్రితం ఖిల్లాఘనపురం మండలంలో చిన్నారెడ్డి పర్యటనలో మొదలైన ప్రొటోకాల్ రగడపై ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గీయులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1.07లక్షల ఓటర్ల అభీష్టం మేరకు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి మేఘారెడ్డి దొడ్డిదారిలో వచ్చినట్లు ఎలా అవుతుందని నిలదీశారు. దిగువ స్థాయి ప్రతిపక్ష ప్రజాప్రతినిధిని మంత్రితో భేటీ చేయించిన చొరవ.. సొంత పార్టీ ఎమ్మెల్యేను కలుపుకొని పోవడంలో ఏమైందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తీరును ఎండగట్టారు. డీసీసీ అధ్యక్షుడు కాంగ్రెస్ ఎంపీపీలను కాకుండా బీఆర్‌ఎస్ ఎంపీపీని సన్మానించి గ్రూప్ రాజకీయాలకు తెరలేపారని, కాంగ్రెస్ కార్యకర్తలకు ఏం సందేశం ఇస్తున్నారో ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు.

మేఘారెడ్డిని రాజకీయంగా దెబ్బకొట్టేందుకు కుట్ర

పదవికి చిన్నా, పెద్ద తేడా ఉండదని వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ అన్నారు. చిన్నారెడ్డి తాను పెద్దవాడిని అనడం హాస్యస్పదమన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో చిన్నారెడ్డి చేతులు కలిసి మేఘారెడ్డిని రాజకీయంగా దెబ్బకొట్టేందుకు ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోం అని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమన్వయకర్త లక్కాకుల సతీష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ కేటాయింపులో ఏఐసీసీ నిర్ణయాన్ని తప్పుపట్టిన చిన్నారెడ్డి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ హోదాలో తనను తానే సస్పెండ్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వెంకటేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, చీర్ల సత్యం, యాదగిరి, మధుగౌడ్, రవియాదవ్, నక్కరాములు, జంపన్న, శరవంద, చంద్రమౌళి, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీర్ల చందర్

ప్రొటోకాల్ గురించి ఒకరితో చెప్పించుకునే స్థాయిలో లేము

ఖిల్లాఘనపురం: ప్రొటోకాల్ గురించి ఒకరితో చెప్పించుకునే స్థాయిలో తాము లేమని, అవగాహన లేని నాయకులు అర్థం లేకుండా మాట్లాడటాన్ని మానుకోవాలని ఖిల్లాఘనపురం తాజా మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. ఖిల్లాఘనపురం మండలం కర్నెతండా పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని శుక్రవారం మేఘారెడ్డి వర్గీయులు ప్రెస్‌మీట్లు పెట్టడంపై అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోపాల్‌పేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు ఇక్కడ ఏం జరిగిందో తెలుసుకొని మాట్లాడితే మంచిదన్నారు. ఉద్దేశపూర్వకంగా కుట్రలు చేసి ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే రాకుంటే ప్రొటోకాల్ పాటించనట్లా అని ప్రశ్నించారు. తన 29 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటివి చాలా చూశానని, ఒకరితో చెప్పించుకునే స్థాయిలో తాము లేమన్నారు. పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యేకు ఎన్ని రకాలుగా ఆహ్వానం పంపినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పీనానాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

వనపర్తి: పట్టణంలోని మైనారిటీ గురుకులం పాఠశాలను ఇన్‌చార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈనెల 4వ తేదీన గురువారం సాక్షి దినపత్రికలో 'మైనార్టీ గురుకులంలో దోమల బెడద' అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం ఉదయం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య తీవ్రతను ప్రిన్సిపల్ సౌమ్య కలెక్టర్‌కు వివరించగా.. గురుకుల పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ వేయటంతో పాటు ఫాగింగ్ చేయని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. దోమల బెడద లేకుండా చేయాలని సూచించారు. నిజానికి విద్యార్థుల డార్మెటరిలో ఫ్యాన్లు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం ప్రస్తావనకు రాకపోవటం శోచనీయం. కలెక్టర్ గురుకులాన్ని విజిట్ చేసిన సమయంలో డార్మెటరీకి తాళం వేసి ఉంచటం గమనార్హం. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ పద్మావతి, జెడ్పీ సీఈఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ తదితరులు ఉన్నారు.



ప్రిన్సిపల్, ఆర్డీఓ పద్మావతితో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సంచిత్ గంగ్వార్

బీజేపీని నిలువరించే బాధ్యత కమ్యూనిస్టులదే

పెబ్బేరు రూరల్: దేశంలో బీజేపీని నిలువరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపైనే ఎక్కువగా ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలనరసింహ అన్నారు. వనపర్తి జిల్లా సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో, మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ ఉదాసీనత వైఖరి వల్లే బీజేపీ బలపడిందన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానంలో సీఎం 8 సార్లు పర్యటించినా కిందిస్థాయి క్యాడర్ నిర్లక్ష్యం కారణంగా 4,500 స్వల్ప ఓట్ల తేడాతో ఆ సీటు కాంగ్రెస్ చేజారటం అందులో భాగమన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆగస్టు 22, 23, 24న సీపీఐ రాష్ట్ర పార్టీ నిర్మాణ సభలు జరుగుతాయని, గ్రామ, మండల, జిల్లా నిర్మాణ సభలను అనుగుణంగా జిల్లా నిర్మాణ సభలను పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, రాబర్ట్, మోష, చంద్రయ్య, రమేష్, అబ్రహం, శ్రీరామ్, గోపాలకృష్ణ, గోపాల్, రవీందర్, శ్రీహరి, సీఎస్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎక్సైజ్ అధికారులతో కాలనీవాసుల వాగ్వాదం

అమరచింత: పట్టణంలోని రాజవళీ దర్గా సమీపంలో సారా అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొనేందుకు వచ్చిన ఎక్సైజ్ శాఖ అధికారులను స్థానిక కాలనీవాసులు అడ్డుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శివాజీనగర్‌కు చెందిన చున్ను అనే వ్యక్తి కల్తీ సారా అమ్ముతున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్‌ఐ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సదరు వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసేందుకు అమరచింతకు వచ్చారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు బెల్ట్ షాపులు, కల్తీ కల్లు అమ్ముతున్న వారిని పట్టుకోలేని ఎక్సైజ్ అధికారులు నిరుపేద వ్యక్తి అయిన చిన్ను ఇంటిలో ఎలా సోదాలు చేస్తారని ప్రశ్నించారు. దీంతో కాలనీవాసులు ఎక్సైజ్ పోలీసుల మధ్య వాదోపవాదాలు జరగగా.. మరోమారు కల్తీసారా అమ్మితే కాలనీవాసులమే పట్టిస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. పట్టణంలో పవిత్ర స్థలాల వద్ద సారా అమ్మకాలు సరికాదని, అలాంటి అడ్డుకునేందుకు సహకరించాలని ప్రజలను ఎక్సైజ్ ఎస్‌ఐ కోరారు.

బొగ్గు గనుల వేలం నిలిపివేయాలి

పెబ్బేరు రూరల్: సింగరేణిలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలాన్ని బీజేపీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం అడిషనల్ కలెక్టర్ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలంలో పోటీపడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే కేంద్ర ప్రభుత్వం నాలుగు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పిందని.. ప్రస్తుతం రాష్ట్రం నుంచి బొగ్గుగనులశాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం ప్రక్రియ ప్రారంభించడం అన్యాయమని తెలిపారు. సింగరేణి బొగ్గు బ్లాక్ వేలం నిలిపివేయాలని తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష పార్టీలను కలుపుకొని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ జబ్బార్, విజయరాములు, హన్మంతు, పుట్టా ఆంజనేయులు, మండ్ల రాజు, రమేష్, కురుమయ్య, మదన్, మోషా, గోపాలకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

బాలల హక్కులు పరిరక్షించుకుందాం

పెబ్బేరు రూరల్: బాలల హక్కులు పరిరక్షించాలంటే ప్రతి ఒక్క చిన్నారి తాము ఎదుర్కొంటున్న సమస్యలు, రోజులో వారికి తారసపడుతున్న ప్రతి విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేందర్ కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉన్నత స్థానంలో నిలబడాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నరేందర్, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 1098 సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుకునే దశలో చదువుపై శ్రద్ధ వహించి బంగారం భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కేస్ వర్కర్ రాజు సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని, అంతేకాకుండా దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉందన్నారు. విద్య అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్యవివాహాలను నివారించేందుకు విద్యార్థులు తోడ్పాటును అందించాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు డీఎంఆర్ఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. చిన్నపాటి జలుబు, జ్వరం వచ్చినట్లు అనిపిస్తే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో వార్డెన్ బెనర్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన బోయ బాలరాజు (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.5వేలు ఆర్థికసాయం పంపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటస్వామి, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, రవి, బుచ్చన్న, రామాంజనేయులు, కుర్మన్న, ఊషన్న, రాఘవేందర్, రాజశేఖర్ ఉన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు వెంకటయ్య ఇటీవల మరణించగా శుక్రవారం ఆ సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.7 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.